మనం ఇంకో విషయాన్ని కూడా ఆలోచించాలి. కాంగ్రెసును సంస్కరించగలననే తాపత్రయం కొద్దీ ఇష్టమొచ్చిన చర్చలను తీసుకున్న నెహ్రూ ఆ పనులను చెయ్యగలడా? అని. మనకు నాలుగుసంవత్సరాల కాంగ్రెసు పరిపాలనానుభవం ఉంది. ఈ పరిమిత కాలంలో ఎన్నో అక్రమాలు, అన్యాయాలు జరిగినై. వాటన్నిటినీ నెహ్రూ ఏమాత్రం సరిచేయగలిగాడు. మద్రాసు ప్రభుత్వంమీద ప్రకాశం చేసిన ఆరోపణలు నెహ్రూ ఎరుగడా? సుమారు నెల రోజులనుంచి రాష్ట్రం కోసం తపస్సు చేస్తున్న స్వామి సీతారాం, కోర్కెను నెహ్రూమన్నించలేదేమీ? కాంగ్రెసును నెహ్రూ సంస్కరించగలడనే నమ్మకం తనకు లేదని కిద్వాయ్ అంటున్నాడు. అది మనకు కూడా తెలుసు. ఏదిఏమైనా అశోక మెహతా అన్నట్లు కాంగ్రెసువాళ్ళకు ఇంకా నాలుగు సీట్లు రావడానికి మాత్రం ఇటీవల కాంగ్రెసు విధానాల్లో వచ్చిన పరిణామం తోడ్పడవచ్చు. ఈ పరిణామాలని ప్రజాస్వామిక వాదులందరూ తీవ్రంగా ఆలోచించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

కథానిక

# ఆచరణలో ఆశయాలు

జానకి

"నేను పెళ్ళి చేసుకోబోతున్నాను" అన్నాడు వేణు. నేను ఆశ్చర్యపోయాను. పెళ్లి చేసుకోవడంవలన పురుషుడు జీవితాన్ని పాడుచేసుకుంటున్నాడనీ, సంఘసేవ, దేశసేవ చేయడానికి వీలు లేనంతగా సంసార తాపత్రయాల్లో చిక్కుకుంటున్నాడనీ వేణు వాదన. కేవలం వాదనే కాదు. తానిచ్చిన ప్రతి ఉపన్యాసంలోనూ వేలెత్తి చూపిన ప్రత్యేక సమస్య అది. అలాంటి వేణు తనంతట తాను ఎవరి ప్రోత్సాహం లేకుండా వివాహ ప్రసక్తి తెచ్చాడంటే నేనే కాదు, స్నేహితులంతా నిర్ఘాంతపోయినారు. "ఎవరిని?" అన్నాడు సుందరం. వేణు తాపీగా కూర్చున్నాడు.

"ఎవరినా? నా ప్రణయ మూర్తిని. నేను మనసారా వలచిన కన్యను. నా భావి జీవిత పథనిర్దేశినిని. నా జీవితంలో అమృతం చిలికించిన మధుర స్వప్న సుందరిని..." ఈ ధోరణిలో పోతున్నాడు వాడు. "ఇంతకీ ఎవరోయి మన ప్రేయసి?" విశ్వం ఆ పాడు వేణు వాక్ప్రవాహాన్ని. "చెబుతున్నానుగా? తొందరపడతావేం? అద్భుత అసమాన సౌందర్యవతి, అతిలోక లావణ్యవతి, దేవలోకంనుండి ఒక్కమెట్టు క్రిందికి జారి భూలోకంలో జనించిన గంధర్వ కన్య, నా హృదయాధిదేవత అయినటువంటి..." నాకు ఒళ్లు మండింది. వేణు వీపుమీద ఒక్కటివేసి, "ఒరేయ్, సరిగ్గా చెప్తావా చెప్పు, లేదా నోరు మూసుకొని అవతలికినడు" అన్నాను. వేణు తిక్కతిరిగి సరైన త్రోవకి వచ్చాడు. "చెప్తానుగాని, మీరంతా చేరి అల్లరి చేసి, నా దేవిని హడల గొట్టేస్తారేమో?"

"సరే. నీ దేవతని హడలగొట్టేటంత అవసరం మాకు ఏ మొచ్చిందోయ్. మాకూ ఉన్నారు దేవతలు, దెయ్యాలూనూ" అని విసుక్కున్నాడు మూర్తి. "సరే. నేను వివాహం చేసుకోబోయే కన్య మన క్లాసుమేట్ సరస్వతి. తెలిసిందా?" స్నేహితులంతా ఉక్కిరి బిక్కిరయ్యాము. మాట మాత్రమైనా తొణకకుండా కథ వివాహం వరకు ఎలా తీసుకొచ్చాడో ఎవరికీ అర్థం కాలేదు.

విశ్వం మాత్రం తెప్పరిల్లి, "తథాస్తు. సరస్వతి తండ్రి పిల్లను నీచేతిలో పెట్టాడన్న మాట కల్ల. నీకంటే డబ్బున్నవాడు కావాలి ఆయనకి. అథవా పెట్టినా మీ నాన్న అగ్గిరాముడు. కట్నం చాలదని తోసేస్తాడు. ఈ పెళ్ళి జరుగదు" అన్నాడు. వేణు చిన్న బుచ్చుకున్నాడు. "నీకు ఆ అదృష్టం లేదనేగా? కుళ్లు బుద్ధి నీది"

అని చీత్కరించాడు విశ్వాన్ని. ఎవరూ మాట్లాడలేదు. వేణు లేచాడు. "ఏమైనా కానివ్వండి. ఈ విషయాన్ని గురించి మాట్లాడారంటే ముక్కచితకొట్టాను" అని వెళ్ళిపోయాడు. తిరిగి వాడి పెళ్ళి విషయం ఒక్కరైనా ప్రస్తావించలేదు.

రెండురోజులవరకు వేణు కనుపించలేదు. మూడోనాడు వాళ్ళింటికి బయలుదేరాను. అంతగా మిడిసిపడిన వేణు మళ్ళీ కనుపించకపోవటానికి కారణమేమిటో ఊహించలేకపోయినాను. ఏదన్నా ప్రమాదం సంభవించిందేమోనన్న ఆలోచన కలిగింది. తలయెత్తి చూచేసరికి వేణు కనుపించాడు. వాణ్ణి చూస్తే నాకు జాలివేసింది. కళ్ళు యెర్రపడ్డాయి. ముఖం పీక్కుపోయి ఉన్నది. "ఏరా!" అన్నాను. వాడు మాట్లాడలేదు. హోటల్లోకి దారితీశాడు. కాఫీ తెప్పించాను. వేణు తీసుకోలేదు. "ఏరా! ఆహ్వానమన్నా ఉండదా ఏం?" అన్నాను కాఫీ ఊదుకుంటూ. వాడు రుమాలుతో కళ్ళు వత్తుకున్నాడు. నేను కొంతవరకు ఊహించకలిగాను. "మీ నాన్న ఒప్పుకోలేదా?" వేణు నిట్టూర్చాడు. "ఏం చెప్పనురా! సంస్కారం లేని మా నాన్న యీ వివాహానికెల్లా వప్పుకుంటాడు? చదువుకున్న ఆడపిల్లలు చెప్పిన మాట వినరనీ, బొత్తిగా బంధుత్వంలేని పిల్లను ఎల్లా తెచ్చుకుంటామనీ, ఇంత పెద్దపిల్ల పనీ పాట చెబితే చేస్తుందా అనీ అమ్మ సణిగింది. అదివరకే మా మేనమామ కూతుర్ని ఇచ్చే ఏర్పాట్లు జరిగాయనీ, సరస్వతిని చేసుకునే పక్షంలో తన ఆస్తిలో నాకేమీ సంబంధం లేదనీ, తన పరువు నిలబెట్టదగ్గ కొడుకు పుట్టలేదని తానేమీ విచారించటంలేదనీ; నాన్న నిష్కర్షగా చెప్పేశాడు. నలుగురిలో నగుబాటు చెయ్యొద్దని అక్కయ్య బ్రతిమాలింది. అనంతమైన అనురాగాన్ని త్రుంచివేయగలనా? లేకపోతే ఆప్తులతో వైషమ్యాలు పెంచుకోగలనా?" వేణు చాల ఆవేశంతో మాట్లాడాడు.

నేను వాడి కళ్ళల్లోకి చూచాను. మానవుడు అనుభవించరాని కష్టాలన్నీ అనుభవించేసినంత బాధాపూరితంగా ఉన్నాయి వేణు లోచనాలు. "నా సలహా పాటిస్తావనే నమ్మకంలేదు నాకు. కాని చెప్తాను. సరస్వతిని మనసారా ప్రేమించానంటున్నావు. హృదయంలో ప్రేమ ఉన్న వ్యక్తి ఎవరినైనా ప్రేమించగలడు. నేడు సరస్వతికోసం ప్రత్యేకంగా నీ హృదయంలో ప్రేమ పుట్టలేదు. వివాహం చేసుకున్న తర్వాత మేనమామ కూతురు సీతని ప్రేమించలేవనే నమ్మకం ఏమిటి? నీ అనురాగం కోసం ముసలివాళ్ళయిన తల్లిదండ్రులను కష్టపెట్టి, నీ బ్రతుకు నెందుకు పాడుచేసుకుంటావు? ఐనవాళ్ళతో విరోధాలు పెట్టుకొని నీలాంటివాడు లోకంలో జీవించలేడు. చిన్నతనపు చేష్టలు ఇంకా మానలేదు నీవు. మీ నాన్నమాట విను. సలక్షణమైన పిల్ల కట్నం కానుకలతో వస్తుంది సుఖపడే వ్రాత ఉంటే అల్లా చేస్తావు" అన్నాను. వేణు నిశ్శబ్దంగా కూర్చున్నాడు.

"ఐతే సరస్వతిని మరిచిపోయి ఆమెకుచేసిన వాగ్దానాలు అబద్ధం చేసెయ్యమంటావా?" అన్నాడు క్రిందికి చూస్తూ. "వాగ్దానాలేమీ అడ్డురావు. ఆమెను మరచిపోవడం అంత అసాధ్యమైన పని కాదు. ఆమెను కష్టపెడ్తాననే ఆలోచన వద్దు. నీవు కాకపోతే మరోడు ఆమెను చేసుకోకపోడు" కాని నా మాటలు వాడి బుఱ్ఱను తాకలేదు. దీర్ఘమైన ఆలోచనలో ఉన్నాడు. నేను కాఫీ త్రాగటం పూర్తైంది. ఉన్నట్లుండి వేణు ఉలిక్కిపడ్డాడు. "వీల్లేదు. ఈ జీవితంలో సరస్వతిని విడిచిపెట్టలేను. ఈ హృదయం ఏనాడో ఆమెకు అంకితమైపోయింది. మా ప్రేమను గురించి చెప్పడానికి మాటలు చాలవురా. ఎన్నోవిధాలుగా మురిపించి, ఆకాశపథాల కెత్తిన సరస్వతి ఈనాడు నన్నుకాక మరెవరిని వరిస్తుంది? ఎన్ని యుగాలనుండో ఉన్న ఈ బాంధవ్యాన్ని ఎల్లామాపేయగలను? నా సరస్వతి నాకు దక్కనినాడు యీ బ్రతుకంతా వ్యర్థం. ఆమె నా అర్ధాంగి కానినాడు నా హృదయం ఎడారి. ఆమె కనుపించనినాడు నా ప్రేమ, వలపు అడవి కాచిన వెన్నెల ఐపోతాయి." వేణు ఇక మాట్లాడలేక పోయాడు. చేతుల్లో ముఖం దాచుకున్నాడు. నేనేం అనేది? "ఏమిటి వేణూ అంత ఉద్రేకం పనికిరాదు. నడిరోడ్డు మీద కాదు నీ బాధల్ని ఏకరువుపెట్టేది. పద

"మా యింటికి పోదాం." అన్నాడు, వేణు లేచాడు. "వద్దురా. ఇంటికి వెళ్ళుతాను" అన్నాడు.

"సరే కాని, విశ్వంతో సంప్రదించు. నీవు తొందర మనిషివి, ప్రపంచానికి ఎదురు తిరగడానికి ప్రూనుకోకు. నేను సాయంకాలం రైల్లో మా ఊరు వెడుతున్నాను. ఒరేయి, సాహసమేమన్నా చేశేవు సుమా! ఒచ్చే ఏడాది పాపాయితో చూడాలి నిన్ను." అంటూ లాలిస్తూ వాడింటి వరకూ దింపాను. నేను ఆనాడే మా గ్రామానికి వెళ్ళాను.

మా రిజల్ట్సు పడినాయి. స్నేహితులంతా ప్యాస్ ఐనాము. నేను మా ఊళ్ళోనే స్థిరపడ్డాను. వేణు వివాహం జరగవలసిన ముహూర్తానికి జరిగిందో లేదో, వాడు ఏమి నిర్ణయించుకున్నాడో నాకు తెలియదు. వేణు నాకు లేఖలు వ్రాయడంలేదు. ఆ మధ్య బెజవాడ వెళ్లాను పనిమీద. అకస్మాత్తుగా వేణు కనిపించాడు. చాలా ఆరోగ్యంగా, పరిశుభ్రంగా ఉన్నాడు. ఖరీదైనా సూటు, చేతిలో గోల్డుఫ్లేకు వాడి స్థితిని చెప్తున్నాయి.

వాడి యింటికి తీసుకువెళ్ళాడు. త్రోవలో ఎన్నో విషయాలు చెప్పాడు. తాను మంచి స్థితిలో ఉన్నాడు. విశ్వం మద్రాసులో ప్రాక్టీసు పెట్టాడు. మూర్తి విశాఖపట్టణంలో ఉన్నాడు. సుందరం జాడ తెలియదు. ఇదీ మాటల సారాంశం. కాని యీ విషయాలేమీ నాకు పట్టలేదు. నా సందేహాన్ని వాడు తీర్చలేదు. నేను అడగటానికి సాహసించనూ లేదు. వేణు యింటికి చేరాము.

"ఇదుగో. నామిత్రునికి ప్రస్తుతానికి కాఫీ రాత్రికి భోజనం, ఏర్పాటు చెయ్యాలి" వాడేదో చెప్పుకు పోతున్నాడు. నా మెదడు మాత్రం తీవ్రంగా ఒక్క విషయాన్ని గురించి ఆలోచిస్తున్నది. "కాఫీ" రెండు కప్పులు మా చేతుల్లోకి వచ్చాయి. నేను తలెత్తి చూచాను. వేణు వంక చూచాను, వాడు అర్ధాంగి సీతపై చిరునవ్వు విసురుతున్నాడు.

——: O :——

# జపాన్ శాంతిసంధి నిజస్వరూపం

బి. నాదమునిరాజు

జపాన్ శాంతి సంధి ఒడంబడికకు ఒక్క నవచైనాకు తప్ప యుద్ధంలో పాల్గొన్న తక్కిన దేశాలన్నిటికీ అమెరికా ఆహ్వానం పంపించింది. ప్రతిదేశానికి యీ ఆహ్వానంతో పాటు అమెరికా తయారు చేయగా యింగ్లండ్, ఫ్రాన్సులు సవరణలు చేసి అంగీకరించిన శాంతి సంధి ముసాయిదాను కూడ పంపింది అమెరికా. ఆహ్వానించబడిన 50 దేశాల్లో ఏ నాలుగయిదు దేశాలో తప్ప మిగతా అన్ని అమెరికన్ కనుసన్నలలో మెలిగే దేశాలే కాబట్టి ఈ ముసాయిదా యధాతథంగా ఆమోదింపబడుతుందని ఎవరైనా అర్థం చేసుకుంటారు. అచిసన్, ట్రూమన్లు "అలస్యం అనేది లేకుండా ఆమోదింప బడుతుంది" అని చెప్పిన మాటలకు కూడా యిదే అర్థం. మన ప్రధాని పండిత నెహ్రూ యిది గుర్తించే ఆ ముసాయిదాలోని కొన్ని హంశాలు తాము ఆమోదింప జాలమని అందుకై ఇండియా ఆ సమావేశంలో పాల్గొన జాలదని స్పష్టంగా ప్రకటించారు. మన ప్రధాని మాటలను బట్టి చూచినను అది వుత్త ముసాయిదా మాత్రం కాదని అదే అంతిమ పత్రమని అర్థమవుతుంది. ఆ ముసాయిదా సవరణలు అంగీకరించదని నెహ్రూ మాటలవల్ల వెంటనే మనం తెల్సుకోవచ్చు.

ఇంక జపాన్ యుద్ధంలో పాల్గొన్న అన్ని దేశాలకు ఆహ్వానంపంపుతూ చైనాకు ఆహ్వానం పంపక పోవడమంటే ముఖ్యమైన యిద్దరు ప్రతికక్షుల్లో ఒకనిని పిలవకుండా రాజీ తతంగం జరపడం కాదా? ఫాసిస్టు జపాన్ సామ్రాజ్య కాంక్షకు బలియైన అన్ని దేశాలకంటే ఎక్కువ నష్టపడిన చైనా దేశంలో యిప్పుడు కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడినంతమాత్రాన దానిని